



మాట్లాడుతున్న కూర వెంకటయ్య

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి

కొడంగల్ రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే ముదిరాజులను బీసీ-ఏ లోకి మారుస్తామని ఇచ్చిన హామీ నేటికి అమలుకు నోచుకోవడం లేదని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూర వెంకటయ్య అన్నారు. గురువారం ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో ఫ్లెక్సీని ఏర్పాటు చేసి ముదిరాజ్ సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన ముదిరాజులకు మంత్రి వర్గంలో, కార్పొరేషన్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా కొడంగల్ పెద్దచెరువు సంఘం అధ్యక్షుడు కిష్టయ్య, నారాయణ, నర్సింలు, భవనప్ప, సాయిలు, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి

కీసర, నవంబరు21(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కీసర పోలీస్ స్టేషన్ సీఐ వెంకటయ్య అన్నారు. ఈ మేరకు గురువారం కీసర పరిధిలోని శ్రద్ధ, స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాలు, ర్యాగింగ్, సైబర్ క్రైమ్ అంశాలపై పోలీస్ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మత్తుకు బానిసలు కాకుండా తమ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించి కుటుం ఆనికి, సమాజాభివృద్ధికి పాటు పడాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ఎలాంటి ఆపదలో ఉన్నా వెంటనే 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసుల సేవలను సద్వినియోగించుకోవాలన్నారు.

ఐక్యంగా ఉండండి.. పోరాడుదాం

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



లగచర్లలో రైతులతో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

బొంరాస్‌పేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాధిత రైతులంతా ఐక్యంగా ఉండాలని, ఎర్రజెండ సాక్షిగా ఎవరి భూములు ఎక్కడికి పోవని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్ర లగచర్ల రైతులకు భరోసానిచ్చారు. గురువారం తమ్మినేని, సీపీఐ నాయకురాలు పశ్య పద్మ ఆధ్వర్యంలో 11 పార్టీల నాయకులు దుద్యాల మండలంలోని రోటిబండ తండా, లగచర్ల, పులిచర్ల కుంట తండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ కలెక్టర్‌పై దాడి చేయకున్నా దాడి చేసినట్లు చిత్రీకరిస్తున్నారని వాపోయారు. ఈ సందర్భంగా తమ్మినేని విలేకరులతో మాట్లాడుతూ నిరంకుశ పోకడలతో ప్రజాభీష్టం లేకుండా భూములు సేకరించడం సరైంది కాదన్నారు. రైతుల తరఫున పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రైతుల వివరాల ప్రకారం.. ఈ ప్రాంతంలో వచ్చే ఫార్మా కంపెనీలు సీఎం అల్లుడివేనని తెలుస్తుందన్నారు. ఈ ప్రాంతంలో 1,156 ఎకరాల సీలింగ్ భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఆ భూముల్లో ఇండస్ట్రీ కారిడార్ ఏర్పాటు చేయాలన్నారు. దామగుండంలో 12వేల చెట్లను నరకడం, హైడ్రాతో కూల్చివేతలు, మూసీ పరీవాహక ప్రాంతంలో పేద ప్రజల ఇళ్లను కూల్చివేయడం అప్రజాస్వామికం అన్నారు. గతంలో ఫార్మా కోసం సేకరించిన 13వేల ఎకరాలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. అక్రమంగా అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని సీపీఐ నాయకురాలు పశ్య పద్మ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోవర్ధన్, ఆకుల పాపయ్య, రామక్క, జానకిరామయ్య, వనం సుధాకర్, రాజరమేశ్, నర్సింహారావు, విజయలక్ష్మీ పండిత్, నరహరి, ప్రసాద్, పద్మ, గీత, మహేందర్ పాల్గొన్నారు.

భూసేకరణకు నోటిఫికేషన్ ఇవ్వాలి

పరిగిరూరల్: లగచర్లలో ఫార్మాసిటీకి భూ సేకరణకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సూచించారు. గురువారం లగచర్ల ఘటన బాధితుల పరామర్శకు వెళ్తున్న ఆయనకు పరిగిలో పార్టీ శ్రేణులతో కలిసి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.వెంకటయ్య ఎర్ర కండువాలు కప్పి స్వాగతం పలికారు. అనంతరం తమ్మినేని పార్టీ శ్రేణులతో కలసి లగచర్లకు వెళ్లారు.



సరికొత్తగా ఉపాధి

ఉపాధి హామీ పథకంలో కొత్త పనులు

566
గ్రామ పంచాయతీలు

1,86,040
జాబ్ కార్డులు

3,78,520
మంది కూలీలు

59,85,161
కల్పించాల్సిన పనిదినాలు

58,563,245
కల్పించిన పనిదినాలు

3,253
కుటుంబాలకు
వంద రోజుల పని

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొత్తగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇంతవరకు కొనసాగించిన పనులే కాకుండా ఈ ఏడాది కొత్త వాటికి శ్రీకారం చుట్టనుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో గుర్తించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేయడంతో పాటు కొన్ని చోట్ల ఆ పనులనే మళ్లీ చేపట్టి బిల్లులు తీసుకుంటున్న ఉదంతాలు వెలుగులోకి వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్రమాలకు చోటు లేకుండా పకడ్బందీగా చేపట్టేందుకు కేంద్రం అవసరమైన మార్పులు చేస్తోంది. ఏ సంవత్సరంలో గుర్తించిన పనులను ఆ ఆర్థిక సంవత్సరంలోనే పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టింది.

- గ్రామ సభల్లోనే పనులను గుర్తించే ప్రక్రియ
- రైతులకు అవసరమయ్యే పనులకే ప్రాధాన్యం
- పకడ్బందీగా స్కీం అమలుకు కేంద్రం కసరత్తు
- ఈ ఏడాది జిల్లాలో రూ.60 కోట్లతో పనులు

వికారాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో 18 మండలాల పరిధిలోని 566 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 1,86,040 జాబ్ కార్డులున్నాయి. 3,78,520 మంది కూలీలు నమోదు చేసుకున్నారు. జాబ్ కార్డుల్లో 1,31,475 మందిలో 2,45,283 మంది కూలీలు మాత్రమే ఉపాధి పనుల్లో చురుకుగా పాలుపంచుకుంటున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 59,85,161 పని రోజులు కూలీలకు కల్పించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 58,563,245 పని రోజులు కల్పించారు. ఒక్కో కుటుంబానికి వంద రోజుల పని కల్పించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 3,253 కుటుంబాలకు

మిగతా 8వ పేజీలో...

సీసీఐ సిమెంట్ నమ్మకమైంది

ప్రైవేట్ సంస్థల వలె మోసం ఉండదు

ఢిల్లీ మార్కెటింగ్ జీఎం అలోక్ శుక్లా
సీసీఐ సిమెంట్ డీలర్,
సబ్ డీలర్లతో సమావేశం

6



పెరటి కోళ్ల పెంపకంతో లాభాలు

నాటు కోడికి పెరిగిన డిమాండ్

ఎన్ఆర్ఐ డైరెక్టర్ బుధేరా
బ్యాక్ యార్డ్ పౌల్ట్రీ పేరిట
కోడి పిల్లల పంపిణీ

6



తాండూరు బల్దియా జేసీబీ ఎక్కడ?

ఏడాదిగా కనిపించని వాహనం

ప్రైవేట్ జేసీబీలతోనే పనులు
లక్షల రూపాయలు దుబారా
ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

8



పోలీసింగ్.. చాలెంజింగ్ జాబ్

యాక్షన్ ఎక్కువైనా..
తక్కువైనా విమర్శలు తప్పవు
శిక్షణలో నేర్చుకున్నవి
విధుల్లో ఉపయోగపడతాయి
పీసీ అవుట్ పాసింగ్ పరేడ్‌లో
మల్టీజోన్ ఐజీ 2 సత్యనారాయణ
విధుల్లో చేరనున్న
271 మంది కానిస్టేబుల్స్



పాసింగ్ అవుట్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఐజీ సత్యనారాయణ



ప్రతిభ కనపరిచిన వారికి పురస్కారం అందజేస్తున్న ఇంటలీజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి

వికారాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్ ఉద్యోగం చాలెంజ్‌తో కూడుకున్నదని ఇందుకు ధైర్యం ఉండాలని మల్టీజోన్ ఐజీ-2 సత్యనారాయణ అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో 9 నెలలుగా శిక్షణ పొందిన 271 మంది కానిస్టేబుల్స్ శిక్షణ పూర్తి కావడంతో నిర్వహించిన అవుట్ పాసింగ్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పోలీస్ పరేడ్ సందర్భంగా గౌరవ వందనం స్వీకరించినన అనంతరం అవుట్‌డోర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన లొంగ్య సురేష్, ఫైరింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గోరగంటి వినోద్, ఇండోర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన శెట్టి నాగేందర్‌లకు మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా న్యాయంగా విధులు నిర్వహిస్తామని ఎలాగైతే ప్రతిజ్ఞ చేశారో ఆ విధంగానే ఉండాలన్నారు. యాక్షన్ ఎక్కువైనా, తక్కువైనా

మిగతా 8వ పేజీలో...

మెట్రో ఫేజ్-2 అమలుపై ప్రభుత్వ పక్షపాతం

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగర జనాభాలో 40 శాతంకు పైగా ఉన్న ఉత్తర హైదరాబాద్ ప్రాంతాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం పక్షపాత ధోరణి అవలంబిస్తూ నిర్లక్ష్యానికి గురిచేస్తున్నదని బీజేపి జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి ఆరోపించారు. ఈ మేరకు బీజేపీ నాయకులు గురువారం తూంకుంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెట్రో ఫేజ్-2లో నార్త్ హైదరాబాద్‌కు చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. 40 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఫోర్త్ సిటీని ప్రాజెక్టులో చేపట్టి అధిక జనాభా గల ప్రాంతాలను పట్టించుకోవడం లేదన్నారు. ఈ కారిడార్‌లను చేపడితే ఐటీ నిపుణులు, విద్యార్థులు, కార్మికులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. సమావేశంలో విగ్నేశ్వర్, కాసుల ఈశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లారెడ్డి



మాట్లాడుతున్న బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

హక్కుల పరిరక్షణకే బీసీ కమిషన్

బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోపిశెట్టి నిరంజన్
బీసీ కులాలు, సంఘాల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

రంగారెడ్డి అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో వెనుకబడిన బలహీనవర్గాల ప్రజలు ఎంతమంది ఉన్నారో తెలిస్తే వారికి చేయూత కల్పించేందుకు ఆస్కారం ఉంటుందని తెలంగాణ బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. గురువారం బీసీ కమిషన్ చైర్మన్, బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల స్థితిగతులపై బహిరంగ విచారణ కార్యక్రమం నిర్వహించారు. సంచార జాతులు, ముదిరాజు, పూసల, మేదర, గంగపుత్ర, బెస్త, బీసీ హక్కుల సాధన కమిటీ, విశ్వబ్రాహ్మణ-విశ్వకర్మ, వాల్మీకిబోయ, వడ్డెర, వీరభద్రుల, రజక, కుమ్మర, దూదేకుల, కుర్మ, మేదర సంఘం ప్రతినిధులు, ఇతర సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు తెలిపారు. ఈ సందర్భంగా బీసి కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకొని వారి హక్కుల రక్షణ కోసం కృషి చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ బహిరంగ విచారణ నిర్వహిస్తున్నదన్నారు. ఇప్పటివరకు ఏడు విచారణలు పూర్తి కాగా, ఇది ఎనిమిదవది అని తెలిపారు. ఈనెల 26 వరకు కమిషన్ బహిరంగ విచారణలు ఆయా జిల్లాల్లో కొనసాగుతాయని చెప్పారు. బీసీలపై ఎక్కడైనా

మిగతా 7వ పేజీలో...

దళారులను నమ్మొద్దు

బొంరాస్‌పేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్దతు ధర కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. గురువారం బొంరాస్‌పేట మండలంలోని పోలెపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్రాములు, నర్సిములుగౌడ్ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, రాజేశ్‌రెడ్డి

కొత్త ఏడాదిలో రూ.2,500 సాయం

» కల్యాణలక్ష్మి కింద తులం బంగారం
» శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్



ఎడ్ల బండిపై వస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

ధారూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాదిలో అర్హులైన మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500, కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం అందజేస్తామని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. వికారాబాద్ జిల్లా ధారూరులో రూ.2.01 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించిన రైస్ మిల్లు, గోదాంతో పాటు ధారూరు, నాగసమందర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం, వాటర్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం వేల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని.. ఆ అప్పులకు కాంగ్రెస్ సర్కారు ఇప్పటివరకు రూ.58 వేల కోట్లు మిత్తి చెల్లించిందని చెప్పారు. మంత్రుల సబ్ కమిటీ నివేదిక రాగానే రైతు భరోసా అందజేస్తామన్నారు. వికారాబాద్ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టులను పర్యాటకంగా అభివృద్ధి చేసి, పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని వెల్లడించారు. అనంతగిరి కొండలను రూ.300 కోట్లతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో సర్పంచులకు చెల్లించని బకాయిలను డిసెంబర్ 9వ తేదీ కల్లా చెల్లించాలని సీఎం నిర్ణయించారన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అంతకుముందు స్పీకర్ రుద్రారం రోడ్డు నుంచి ఎడ్ల బండిపై రైస్ మిల్లు వరకు పీఏసీఏస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డితో కలిసి వచ్చారు. కార్యక్రమంలో పలు పీఏసీఎస్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



వైభవం.. కార్తీక దీపోత్సవం

కీసరగుట్టలో కార్తీక దీపోత్సవం కనుల పండువగా జరిగింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, గురువారం స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రదోష కాల సమయంలో ఆలయ ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఉచితంగా ప్రమిదలు, వత్తులు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగలింగం, ఈవో సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. -కీసర, నవంబరు 21(ఆంధ్రజ్యోతి)

స్పౌజ్‌ల అక్రమ బదిలీలపై చర్యలు తీసుకున్నాం

మేడ్చల్‌ప్రతినిధి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో స్పౌజ్ పాయింట్లు, అక్రమ బదిలీలపై వస్తున్న విమర్శలపై ఎట్టకేలకు మేడ్చల్ డీఈవో విజయకుమారి నోరు విప్పారు. కొన్ని రోజులుగా ఉపాధ్యాయ సంఘాలు, మీడియాలో డీఈవో తీరుపై పెద్ద ఎత్తున విమర్శలొస్తున్న విషయం తెలిసిందే. ఈ అంశంలో ఉపాధ్యాయ సంఘాలు ధర్నాకు సైతం పిలుపునిచ్చాయి. తప్పనిసరి పరిస్థితుల్లో గురువారం డీఈవో స్పందిస్తూ.. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన స్పౌజ్ ట్రాన్స్‌ఫర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో 11మంది ఉపాధ్యాయులు వారి స్పౌజ్‌లకు సమీపంలో గల ఖాళీ పోస్టులను ఎంచుకోకుండా వారికి అనుకూలంగా వెబ్ కౌన్సిలింగ్‌లో స్పౌజ్ క్యాటగిరీలో వేరేచోట్ల ఖాళీ పోస్టులను ఎంచుకున్నారని డీఈఓ తెలిపారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా వారిపై చార్జెస్ ఫ్రేమ్‌చేసినట్లు తెలిపారు. చార్జెస్ ఫ్రేమ్‌పై ఇద్దరు ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారని, స్టే ఎత్తివేతకు జిల్లా విద్యాశాఖ తరఫున వేకెట్ పిటిషన్ వేసినట్లు డీఈవో తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం స్పౌజ్ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన బదిలీలపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఉపాధ్యాయసంఘాలు తలపెట్టిన ధర్నాను తాత్కాలికంగా నిలిపివేశారని డీఈఓ వెల్లడించారు.

సీసీఐ సిమెంట్ నమ్మకమైంది

ఢిల్లీ మార్కెటింగ్ జీఎం అలోక్ శుక్లా



మాట్లాడుతున్న ఢిల్లీ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ అలోక్ శుక్లా

వికారాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ ఉత్పత్తి చేసే సిమెంట్ నమ్మకమైందని, ప్రైవేట్ సంస్థల వలె మోసం చేసేది కాదని ఢిల్లీ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ అలోక్ శుక్లా అన్నారు. గురువారం వికారాబాద్‌లోని హరిత రిసార్ట్‌లో సీసీఐ సిమెంట్ డీలర్, సబ్ డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో సిమెంట్ అవసరాలను తీర్చేందుకు 1965లో సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ స్థాపించారన్నారు. దీనికి తాండూరులో మూడు ఆపరేటింగ్ ప్లాంట్లు ఉన్నాయన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల్లోని కొన్ని ప్రాంతాలకు, హిమాచల్‌ప్రదేశ్, అస్సాం రాష్ట్రాలకు సేవలందిస్తోందన్నారు. 1987లో కరన్‌కోట్‌లో ఇక్కడి ఫ్యాక్టరీని స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం శరత్‌కుమార్, రీజినల్ మేనేజర్ ఉమేష్ కుమార్‌సింగ్, సీనియర్ మేనేజర్లు దివాకర్, శ్రీవాస్తవ, పాండే, మేనేజర్ ఆఫీసర్లు వెంకట్రాములు, రోహిత్ మిశ్రా, అసిస్టెంట్ ఆఫీసర్లు దేవరాజు, బాల్‌రాజు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో లాభాలు



కోళ్ల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మేడ్చల్ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళలు పెరటి కోళ్ల పెంపకంపై శ్రద్ధ చూపాలని ఎన్ఆర్‌సీ డైరెక్టర్ బుధేరా అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చెర్లపల్లి ఐకార్ నేషనల్ మీట్ రీసెర్చ్ వారు గురువారం రావల్కోల్, రాజబొల్లారం గ్రామాల్లో బ్యాక్ యార్డ్ పౌల్ట్రీ పేరిట కోడి పిల్లలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుధేరా మాట్లాడుతూ.. నాటు కోడి మాంసానికి డిమాండ్ పెరిగిందన్నారు. ఇళ్ల వద్ద పెంచే పెరటి కోడి మాంసానికి మరింత గిరాకీ ఉందన్నారు. ఇళ్ల వద్ద గిరిజన మహిళలు పెరిటి కోళ్లను పెంచి ఆర్థికస్థితిని మెరుగుపర్చుకోవాలని సూచించారు. యనియల్ హస్బెండరి ఏడీ ప్రభురాజ్ మాట్లాడుతూ.. పెరటి కోడి మాంసం విక్రయం, వాటి గుడ్ల అమ్మకాలు, ధరలపై వివరించారు. రాజబొల్లారంలో 28, రావల్కోల్‌లో 20 యూనిట్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బలరామ్, భీక్రైనాయక్, డాక్టర్ కురు మూర్తి, మంగ్యానాయక్ పాల్గొన్నారు.

ట్యాక్సీ, క్యాబ్‌లకు సబ్సిడీ నిలిపివేత



మహేశ్వర్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్

వికారాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ట్యాక్సీ, మోటారు క్యాబ్ సబ్సిడీలను నిలిపివేస్తున్నట్లు పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ మహేశ్వర్ గురువారం తెలిపారు. జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న టీ-ప్రైడ్ పథకం కింద ఎస్సీ ఎస్టీ, అంగవైకల్య లబ్ధిదారులకు ట్యాక్సీ, మోటారు క్యాబ్ ఖరీదుకు అందిస్తున్న రాయితీలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2024 డిసెంబరు 1 నుంచి ఎలాంటి వాహన రాయితీలు ఇవ్వబోం అని పేర్కొన్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం



మాట్లాడుతున్న డీఈవో రేణుకాదేవి

తాండూరు రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. గురువారం తాండూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యా సంవత్సరంతోపాటు వచ్చే విద్యా సంవత్సరంలోనూ విద్యాప్రమాణాలు పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కలెక్టర్, విద్యాశాఖ ఆధ్వర్యంలో 1వ తరగతి నుంచి 5వ తరగతులు, 6 నుంచి 9వ తరగతుల విద్యార్థుల్లో పఠన సామర్థ్యాలను పెంచేందుకు దృష్టిసారించామన్నారు. పాఠశాలల హెచ్‌ఎంలకు ఎఫ్ఎల్ఎన్‌పై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఈ డిసెంబరు నాటికి సిలబస్ పూర్తిచేసి రివిజన్ చేపట్టాలని ఆదేశించామని తెలిపారు. ఇప్పటికే స్పెషల్ క్లాసులపై ఫోకస్ పెట్టామన్నారు. యేటికేడు టెన్త్ ఫలితాల్లో మెరుగుదల కన్పిస్తోందని డీఈవో గుర్తు చేశారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏసీపీ శ్రీనివా్‌సరెడ్డి

మేడ్చల్ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ర్యాగింగ్ సంస్కృతిని వీడి క్రమశిక్షణతో మెలగాలని మేడ్చల్ ఏసీపీ శ్రీనివా్‌సరెడ్డి అన్నారు. గురువారం ఘనాపూర్ మెడిసిటీ మెడికల్ కళాశాల విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు జూనియర్లు, సీనియర్లు అనే తేడా ఒకరినొకరు గౌరవిస్తూ చదువుకోవాలన్నారు. విద్యార్థుల్లో ర్యాగింగ్ పట్ల చైతన్యం తీసుకొచ్చేందుకు చేపడుతున్న అవగాహనా సదస్సులు సత్ఫలితాలిస్తున్నాయని తెలిపారు. కళాశాలలో ర్యాగింగ్ చేయకుండా యాజమాన్యాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మేడ్చల్ సీఐ సత్యనారాయణ, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న స్పీకర్



పడిపూజలో మొక్కుతున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని వికారాబాద్‌లోని శివాజీనగర్ కాలనీలో సోమ నర్సింహులు గురువారం నిర్వహించారు. పూజ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరైన స్వామి వారిని దర్శించుకున్నారు. వందలాది మంది అయ్యప్ప స్వాములు వచ్చి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కిషన్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

మండల సాధన ఉద్యమం ఉధృతం



రిలే దీక్షలో కూర్చున్న జేఏసీ నాయకులు

తలకొండపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండలంగా సాధించే వరకు ఉద్యమ పోరాటాన్ని ఆపం అని గట్టిప్పలపల్లి మండల సాధన జేఏసీ నాయకులు ప్రకటించారు. రోజురోజుకూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. గట్టిప్పలపల్లిని మండలం చేయాలనే డిమాండ్‌తో జేఏసీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారంతో 21వ రోజుకు చేరాయి. దీక్షలో జేఏసీ నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం ఏర్పాటుకు ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవి శ్రద్ధతీసుకోవాలని నాయకులు కోరారు. దీక్షలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ శరత్‌చంద్ర, కార్యదర్శి ఆంజనేయులుగౌడ్, శ్యామల్‌కుమార్, శివయ్య, వినోద్‌బాబు, శ్రీను, రవి, బాలయ్య, జంగయ్య, చంద్రయ్య, రాజు, నర్సింహ, వెంకటయ్య, కృష్ణయ్య, మల్లయ్య, విజయ్, ఈదమయ్య, నారయ్య పాల్గొన్నారు.

విద్యార్థినులకు పౌష్టికాహారాన్ని అందించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

యాలాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థినులకు పౌష్టికాహారం అందివ్వాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. గురువారం యాలాలలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులను, వంట గదిని సందర్శించారు. విద్యార్థుల భోజనాన్ని, కూరగాయలను పరిశీలించారు. సబ్‌కలెక్టర్ పాఠశాలలో నెలకొన్న సమస్యలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నీటి వసతి సరిగ్గా లేదని, ఇతర సమస్యలు ఉన్నాయని బాలికలు చెప్పారు. అధికారి వచ్చిన సమయంలో ప్రిన్సిపాల్ లేరు. సబ్‌కలెక్టర్ వెంట తహసీల్దార్ అంజయ్య ఉన్నారు.

ఎమ్మెల్సీ కారుకు ప్రమాదం



నాయకులతో మాట్లాడుతున్న నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్ రూరల్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి కారుకు గురువారం సాయంత్రం ప్రమాదం జరిగింది. పట్టణ శివారులోని మిలీనియం టౌన్‌షిప్ వద్ద స్కూటీ యూటర్న్ తీసుకుంటూ ఎమ్మెల్సీ కారును ఢీకొంది. ఎమ్మెల్సీ కారులో షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. గాయపడిన ద్విచక్రవాహనదారుడిని ఎమ్మెల్సీ అనుచరులు, గన్‌మెన్‌లతో ఆసుపత్రికి తరలించారు. కాగా ఎమ్మెల్సీ కారు ముందు భాగం దెబ్బతింది.

జేఎల్ పోస్టుల్లో జయకేతనం

మ్యాథమెటిక్స్‌లో జిల్లా నుంచి 11 మంది ఎంపిక



కె.రాజు పదో ర్యాంక్



సాయికుమార్ 26వ ర్యాంక్



ఎం.రాణి 29వ ర్యాంక్

వికారాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) గురువారం సాయంత్రం విడుదల చేసిన గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్ ఉద్యోగ పరీక్ష ఫలితాల్లో మ్యాథమెటిక్స్ సబ్జెక్టులో జిల్లా నుంచి 11 మంది ఎంపికయ్యారు. వికారాబాద్‌లోని మ్యాథ్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ నుంచి పరీక్ష రాసిన 32 మంది అభ్యర్థుల్లో 11మంది జేఎల్‌లుగా ఎంపికయ్యారు. ఈ అకాడమీకి చెందిన కె.రాజు రాష్ట్ర స్థాయిలో పదో ర్యాంక్ సాధించారు. బి.సాయికుమార్ 26వ, ఎం.రాణి 29వ, కె.సతీష్ 30వ ర్యాంక్‌లు సాధించారు. అలాగే కె.శ్రీనివాస్, బి.మనీష, కె.సంతోష్, జి.రాజశేఖర్, వై.శ్రవణ్‌కుమార్, ఎం.వరలక్ష్మి, జి.మౌనికలు ఉత్తమ ర్యాంక్‌లతో జాబ్‌సాధించారు. ఈ అభ్యర్థులు 11 నెలలు అవిశ్రాంతంగా శ్రమించి జేఎల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని మ్యాథ్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ డైరెక్టర్ ఎస్.రత్నాకర్ తెలిపారు.

మళ్లీ తెరపైకి మనోహ టౌన్‌షిప్

- రాజీవ్ స్వగృహ ప్లాట్ల వేలం
- కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ
- మూడు రకాల ప్లాట్ల ఏర్పాటు
- ధర ఎక్కువంటూ కొనుగోలుదారుల వెనకడుగు



హైదరాబాద్ రోడ్డులోని వెంచర్‌లో అసంపూర్తిగా వదిలేసిన రాజీవ్ స్వగృహ ఇళ్లు, అసంపూర్తి నిర్మాణాలు



తాండూరులోని మనోహ టౌన్‌షిప్

తాండూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వంపై భారం మోపకుండా ఆదాయంపై దృష్టిసారించాలని డిప్యూటీ సీఎం బి.విక్రమార్క, ఈ నెల 4న హైదరాబాద్‌లో రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో సబ్ కమిటీ నివేదిక మేరకు పెండింగ్‌లో ఉన్న రాజీవ్ స్వగృహ ప్లాట్లు, నిర్మాణంలో ఉన్న ఇళ్ల స్థితిగతులను సమీక్షించి నిబంధనల మేరకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

మనోహ టౌన్‌షిప్ అభివృద్ధికి ముందడుగు?

తాండూరులోని హైదరాబాద్ రోడ్డులో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి సమీపంలో 2014లో తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో డీటీసీపీ అప్రూవ్ లేవుట్‌తో మనోహ టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేశారు. 2021, 2022, 2023 సంవత్సరాల్లో వాటికి ఆక్షన్ నిర్వహించారు. అప్పట్లో కొందరు ఉద్యోగులు పూర్తగా ప్లాట్ల విలువ, నిర్మాణానికి డబ్బులు చెల్లించగా మరికొందరు కొంత మొత్తం కట్టి విరమించుకున్నారు. మొత్తానికి డబ్బులు కట్టిన వారి పేరిట ప్లాట్ కేటాయించినా పూర్తిగా కట్టని వారికి ప్లాట్/ఇల్లు హ్యాండోవర్ చేయలేదు. 2023 డిసెంబరులో ప్రభుత్వం మారింది. దీంతో అప్పటి వరకు ప్లాట్లలో ఎంతోకొంత పనులు జరిగినా కొత్తగా వచ్చిన ప్రభుత్వంలో పనులు నిలిచాయి. దీంతో ఇళ్ల, ప్లాట్ల కేటాయింపు నిలిచిపోయింది. మారిన పరిస్థితుల నేపథ్యంలో మరోసారి ప్లాట్లకు మరోసారి వేలాన్ని నిర్వహించనున్నారు. యాలాల మండలం కోకట్‌లో సర్వే నంబరు 52లో మూడు రకాల ప్లాట్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 14ఓపెన్ ప్లాట్లు, సెమీ ఫినిష్ 54 ప్లాట్లు ఉన్నాయి. త్వరలో వీటిని వేలం వేసి విక్రయించాలని అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఇళ్లు కట్టించి అప్పగించడమా? లేక ఓపెన్ ప్లాట్లనే కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ చేయించడమా? అనే అంశంలో సందిగ్ధంలో ఉన్నారు.

ప్లాట్ రకం	వైశాల్యం(స్క్వేర్ మీటర్లు)
క్లాసిక్	209.05
ఇంట్రాసిటీ	167.18
బేసిక్	125.54
సివిక్స్	88.66

ధరపైనే తకరారు

డీటీసీపీ అప్రూవ్డ్ లేవుట్లు హైదరాబాద్ రోడ్డు మార్గంలో బైపాస్ రోడ్డుకు సమీపంలో ఉండటం, బస్టాండ్, రైల్వే స్టేషన్లకు 4కి.మీ లోపే ఉన్నాయి. అయితే ఆక్షన్ కోసం ఏర్పాటు చేసేత సదస్సుల్లో ధర ఎక్కువగా ఉందని కొందరు వాదిస్తున్నారు. గతంలో ప్రభుత్వం గజానికి రూ.10వేలను నిర్ణయించింది. అయితే కొన్ని ప్లాట్లకు బిడ్డింగే కాలేదు. ఎక్కడా లేని విధంగా రాజీవ్ స్వగృహ ప్లాట్లకు ధరను నిర్ణయించాలని కొనాలనుకున్న వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్లాట్లు కొన్న వారికి నీటి, రోడ్డు, డ్రెయినేజి వ్యవస్థలు కల్పించక ఇబ్బందులు పడుతున్నారు.

వక్ఫ్‌బోర్డు కోరల్లోకి అనంతగిరి

- పవిత్ర క్షేత్రంలో అక్రమంగా మదర్సా
- మూసీ ప్రక్షాళన హైదరాబాద్‌లో కాదు.. మొదట ఆ నది పుట్టిన అనంతగిరిలో చేయాలి
- ఆలయ పరిరక్షణకు హిందువులు నడుంకట్టాలి
- హిందూ జనశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు లలిత్‌కుమార్



మాట్లాడుతున్న లలిత్‌కుమార్

వికారాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తమిళనాడు తిరుచ్చందూర్, శబరిమల, ముంబై సిద్ధివినాయక ఆలయాల మాదిరిగా అనంతగిరి అనంత పద్మనాభస్వామి ఆలయం కూడా వక్ఫ్ బోర్డులోకి తీసుకునే ప్రమాదం ఉందని హిందూ జనశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు లలిత్‌కుమార్ అన్నారు. గురువారం అనంతగిరికి వచ్చిన ఆయన అనంత పద్మనాభస్వామి కార్తీక మాసోత్సవాల్లో భాగంగా అనంతగిరి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అఖండ భజన భజనలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే వక్ఫ్ బోర్డుకు దేశంలో 9లక్షల ఎకరాల భూమి ఉందని, అయినా ఇంకా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను వక్ఫ్‌కు అప్పగిస్తున్నారని, లేదంటే కబ్జా చేస్తున్నారని మండిపడ్డారు. పవిత్ర అనంతగిరి క్షేత్రంలో అక్రమంగా మదర్సా నడుపుతుంటే అధికారులు, పాలకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అనంతగిరి పరిరక్షణసమితి చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలకు సహకరించాల్సిన అధికారులు అడ్డుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. మూసీ నదిగా పిలువబడే ముచుకుందా నదిని హైదరాబాద్‌లో ప్రక్షాళన చేయడం కాదని, మొదట మూసీ పుట్టిన ఆలయ పుష్కరిణిని బాగుచేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. హిందువులు మొద్దునిద్ర వీడి ఆలయాన్ని రక్షించుకునేందుకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. అనంతగిరి కొండలు మొత్తం అనంత పద్మనాభుడివే అయినా పద్మనాభస్వామి పేరిట గుంట భూమి లేకపోవడం విచిత్రంగా ఉందన్నారు. అధికారులు భూములను వక్ఫ్‌కు కేటాయించడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హిందూ జనశక్తి అధ్యక్షుడు శ్రీనివాస్, ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు నర్సిములు తదితరులు పాల్గొన్నారు.



వడ్లను పరిశీలిస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ మాధవరెడ్డి

కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కందుకూరు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని శంషాబాద్ సర్కిల్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.మాధవరెడ్డి అన్నారు. గురువారం కందుకూరులోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. సన్న రకం ఎ-గ్రేడ్ వడ్లకు క్వింటాలుకు 2,320 మద్దతు ధర అలాగే 500 బోనస్ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే సాధారణ రకానికి 2,300 ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 580బస్తాల ధాన్యం కొన్నామని అధికారికి సీఈవో యాదగిరెడ్డి తెలిపారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలి

పరిగి రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి ముకుంద నాగేశ్వర్ అన్నారు. పరిగిలో ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. పండుగల సాయన్న ముదిరాజ్, క్రిష్ణస్వామి ముదిరాజ్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి ముదిరాజ్ సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దేశమోని మాణిక్యం ముదిరాజ్, మండల అధ్యక్షుడు అనంతయ్య ముదిరాజ్, నాయకులు జనార్దన్ ముదిరాజ్, జేపీ నారాయణ ముదిరాజ్, నరేష్ ముదిరాజ్, సత్యయ్య ముదిరాజ్, రమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

శామీర్‌పేట: మత్స్యకారులు ప్రభుత్వ చేయూతను అందిపుచ్చుకుని ఆర్థికాభివృద్ధిని సాధించాలని మత్స్య పారిశ్రామిక సంఘం శామీర్‌పేట మండల అధ్యక్షుడు కరకపట్ల రాము అన్నారు. ఉప్పరపల్లిలో మత్స్య కార్మికుల దినోత్సవాన్ని నిర్వహించారు. సంఘం జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నందున వారిని బీసీ-ఏ కేటగిరిలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంకరయ్య, రవీందర్, రామచందర్ ముదిరాజ్, నాయకులు కుంట రమేష్, రాజు, బాలకృష్ణ, ఆంజనేయులు, యాదగిరి, శ్రీను, గణేష్, శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



శామీర్‌పేట: సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న రాము ముదిరాజ్

న్యాయం కోసం మృతుడి కుటుంబీకుల ఆందోళన



రోడ్డుపై బైఠాయించిన మల్లేష్ బంధువులు

కేశంపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): లేమామిడి శివారులో గత శనివారం ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడి మృతిచెందిన కేశంపేట మల్లేష్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ గురువారం లేమామిడిలో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేశారు. లేమామిడి- కేశంపేట రోడ్డుపై బైఠాయించారు. మల్లేష్ మరణంతో అతడి కుటుంబం రోడ్డున పడిందన్నారు. వారికి న్యాయంచేయాలన్నారు. ప్రమాదానికి కారణం అయిన నందాచారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళన విషయం తెలుసుకున్న సీఐ నరహరి, ఎస్ఐ రాజ్‌కుమార్ అక్కడకి చేరుకుని వారితో కారులతో మాట్లాడారు. ఘటనపై విచారణ జరిపి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. నందాచారి సైతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని చెప్పారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. తాత్కాలికంగా మల్లేశ్ దహన సంస్కరాలకు రూ.30వేలు ఇప్పించారు. దీంతో మృతుడి కుటుంబీకులు, బంధువులు ఆందోళన విరమించారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

కనుల పండువగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహన్‌రెడ్డి

యాలాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): యాలాలలో గురువారం ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభన ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. మూడు రోజులుగా ధ్వజస్తంభ, బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలు కొనసాగుతున్నాయి. మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. పూజల్లో మాజీ ఎంపీపీ కె.పురుషోత్తంరావు, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సంధార్యాణి, అక్బర్‌బాబ,రవీందర్, బుగ్గప్ప, అశోక్, శివయ్య, యాదప్ప పాల్గొన్నారు. ఈ పూజల నేపథ్యంలో బొడ్రాయికి మహిళలు బోనాల నేవేద్యం సమర్పించారు.

హక్కుల పరిరక్షణకే బీసీ కమిషన్

(5వ పేజీ తరువాయి)

దాడులు జరిగితే బీసీ కమిషన్ చర్యలు తీసుకోవడానికి వెనుకాడదని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వేలో కోటి 15 లక్షల పైచిలుకు కుటుంబాలను రాష్ట్రవ్యాప్తంగా గుర్తించడం జరిగిందని, ఇందులో 87 వేల మంది ఎన్యూమరేటర్లు ఇప్పటివరకు ప్రతీ ఇంటికి వెళ్లి సమాచారం సేకరిస్తున్నారని, సమగ్ర కుటుంబ సర్వే వివరాలు పూర్తిగా పబ్లిక్ డొమైన్‌లో పొందుపర్చడం జరుగుతుందని చెప్పారు. ఈ సర్వేపై అపోహ పడొద్దని సూచించారు. ఇప్పటివరకు 65 నుంచి 70 శాతం సర్వే పూర్తయిందన్నారు. రంగారెడ్డి జిల్లాలో 79 శాతం, మేడ్చల్ మల్కాజ్‌గిరిలో 65 శాతం, వికారాబాద్‌లో 74 శాతం సర్వే పూర్తి చేయడంపై ఆయన అభినందించారు. రెండేళ్ల తొమ్మిది నెలల కాల పరిమితిలో బీసీలకు న్యాయం చేసేందుకు కమిషన్ కృషి చేస్తుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో 44, మేడ్చల్ జిల్లాలో 19, వికారాబాద్ జిల్లాలో 9 మొత్త 72 వినతులు, సలహాలు, సూచనలు, అఫిడవిట్ రూపంలో కమిషన్‌కు సమర్పించారని, వాటన్నిటినీ క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ సతీష్‌కుమార్, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మేడ్చల్ అదనపు విజయేందర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కేశురాం, మేడ్చల్ బీసీ వెల్ఫేర్ అధికారి ఇందిర పాల్గొన్నారు.



వినతి పత్రాలు అందజేస్తున్న కుల సంఘాల నాయకులు

ఎవరేమన్నారంటే..

చట్టసభలో అవకాశం కల్పించాలని మేడ్చల్ జిల్లా కుమ్మరి సంఘం నాయకులు దయానంద్, చంద్రయ్య కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. కుల వృత్తి అంతరిస్తుందన్నారు. భవిష్యత్‌లో మ్యూజియంలో మట్టి పాత్రలు చూడాల్సిన పరిస్థితి రావచ్చన్నారు. కుమ్మరులను ఒండ్రు మట్టి తీయనివ్వడం లేదని తెలపగా, ఒండ్రు మట్టి తీసుకునేందుకు జీవో 140 ఉందని చైర్మన్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా కుమ్మర సంఘం నాయకులు జీవన్ మాట్లాడుతూ బీసీ-బీలో ఉన్న కుమ్మరులను బీసీ -ఎలో చేర్చాలని కోరారు. రంగారెడ్డి జిల్లా కుమ్మర సంఘం నాయకులు దయానంద్ మాట్లాడుతూ కుమ్మరులు చేస్తున్న వృత్తిపై శిక్షణ ఇచ్చి సబ్సిడీపై రుణం ఇవ్వాలని కోరారు. కుల వృత్తిపై స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కిందకు తీసుకురావాలని, కుమ్మరులు ఎదుర్కొంటున్న సమస్యలపై విచారణ చేపట్టి ఈనెల 28 వరకు నివేదిక అందజేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను ఆదేశించారు.

- పూసల కులస్తులు దుర్భర జీవితాలను గడుపుతూ దయనీయ స్థితిలో ఉన్నారని సంఘం జిల్లా నాయకులు సదానందం కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. పూసల కులస్తులను సంచార జాతుల్లో చేర్చాలని కోరారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కుమ్మావత్ కులానికి చెందిన టి. సోనారావు తమ కులాన్ని గుర్తించాలని కోరారు. చిట్టెపు కులానికి చెందిన జంగారెడ్డి చిట్టెపు కులాన్ని గుర్తించాలన్నారు. ఐదు కులాలుగా ఉన్న కమ్మరి, వడ్రంగి, శిలా శిల్పి, స్వర్ణకార, కంచర కులాలను కలిపి విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలుగా గుర్తించాలని సంఘం రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా నాయకులు పులిగిళ్ల శ్రీనివాస చారి, వీరాచారి, వెంకటచారి కోరారు.
- కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి. సుధాకర్, నాయకుడు యాదయ్య మాట్లాడుతూ బెల్టుషాపులు లేకుండా చూడాలని, వైన్స్‌షాపుల్లో సొసైటీలకు రిజర్వేషన్ కల్పించాలని, 29 జీవోను రద్దు చేయాలని చైర్మన్‌ను కోరారు. సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మాట్లాడుతూ బీసీ-ఎ గ్రూపులో ఉన్న తమ కులాల్లో, సంచార జాతులు లేని కులాలు ఉన్నాయని వారిని బీసీ-ఎ గ్రూపు నుంచి తొలగించాలని కమిషన్‌ను కోరారు. ఎస్సీ, ఎస్టీలో నుంచి తమ కులాన్ని తొలగించి బీసీలో చేర్చినా అన్యాయమే జరుగుతుందని వాల్మీకి బోయ సంఘం నాయకుడు లక్ష్మణ్ తెలిపారు. కొండలు, గుట్టల్లో రాళ్లపై హక్కు వడ్డెర కులస్తులకు కల్పించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు విజ్ఞేశ్వర్, యాదయ్య కమిషన్‌ను కోరారు. 50 ఏళ్లు నిండిన క్షౌర వృత్తి దారులకు పింఛన్ ఇవ్వాలని సంఘం నాయకుడు మల్లేష్ కోరారు. ఆరెకటిక సంఘం కులాన్ని గుర్తించాలని సంఘం జిల్లా నాయకురాలు సునీత అన్నారు. బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి ఉప్పరులను చేర్చాలని సంఘం జిల్లా నాయకులు కృష్ణసాగర్, సతీష్ సాగర్ కోరారు.

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి?

ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

మన్సూరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రిలో దారుణం చోటుచేసుకుంది. గుండె జబ్బు చికిత్సకు వెళ్లిన ఓ మహిళ వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతిచెందిందంటూ బంధువులు ఆస్పత్రి వద్ద ధర్నా చేశారు. వివరాల్లోకి వెళితే.. కందుకూరు మురళినగర్‌కు చెందిన రత్లావత్ కోటి(54) రెండు నెలల నుంచి గుండెనొప్పి వస్తోందని నగరంలోని ఓ ఆస్పత్రికి వెళ్లగా వైద్యులు ఆపరేషన్ చేయాలన్నారు. అనంతరం వారు తమకు సమీపంలో ఉందని బుధవారం ఉదయం 7గంటలకు కామినేని ఆస్పత్రికి వచ్చి అడ్మిటయ్యారు. కోటి చికిత్సపొందుతూ అదేరోజు రాత్రి 10గంటలకు మృతిచెందింది. దీంతో ఆగ్రహించిన మృతురాలి భర్త చందు, కుమారులు శ్రీకాంత్, శ్రీను, బంధువులు ఆస్పత్రి వద్ద ధర్నాకు దిగారు. చికిత్స చేస్తామని చెప్పిన వైద్యులు వెంటనే చికిత్స అందించాల్సి ఉండగా రోగి చికిత్సకు 10లక్షల రూపాయల బీమా క్లెయిమ్ అయ్యే వరకు చూసి డబ్బు వచ్చాక రోగి చనిపోయిందని చెప్పారన్నారు. నవ్వుతూ వెళ్లిన తమ తల్లి వైద్యుల నిర్లక్ష్యంతో మృతిచెందిందని కొడుకులు రోదించారు. రాత్రి 9గంటలకు చనిపోయిందని చెప్పి రిపోర్టులో 10గంటలకు అని రాశారని అనుమానం వ్యక్తం చేశారు. విషయం తెలిసి పోలీసులు ఆస్పత్రికి వచ్చి వారితో మాట్లాడి ఆందోళన సద్దుమణిగేలా చేశారు.

అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలి


స్టడీ మెటీరియల్ విడుదల చేస్తున్న జీ5 మీడియా ప్రతినిధులు

మేడ్చల్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీలో సీటు సాధించాలంటే అన్ని సబ్జెక్టులపై పట్టుసాధించాలని 21 సెంచరీ ఐఏఎస్ అకాడమి చైర్మన్ కృష్ణ ప్రదీప్ అన్నారు. 'మొదటి ప్రయత్నంలో సివిల్ సర్వీసెస్ సాధించటం ఎలా' అనే అంశంపై గురువారం కండ్లకోయ సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జీ5 మీడియగా గ్రూప్, 21సెంచరీ ఐఏఎస్ అకాడమీ సంయుక్తంగా ఒకరోజు పాటు యూపీఎస్సీ మాస్టర్స్ క్లాస్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకాడమి చీఫ్ మెంటర్ డాక్టర్ భవానిశంకర్, సీఎంఆర్ఈసీ కార్యదర్శి శ్రీశైలంరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్. రెడ్డి, డాక్టర్ లక్ష్మయ్య, గిరి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి


అదనపు అంతస్తు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చైర్మన్

ఘట్‌కేసర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):మహిళలు ఆర్థికంగా రాణించేందుకు పొదుపు సంఘాలు ఎంతగానో ఉపయోగపడతాయని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్జీకే కాలనీలో రూ.15లక్షల నిధులతో డ్వాక్రాభవనం అదనపు అంతస్తు నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిగూడలో గల ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న బోజనంను తనిఖీ చేశారు. ఆయనవెంట కౌన్సిలర్ శైలజ, హెచ్ఎం పాంబమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

తాండూరు బల్దియా జేసీబీ ఎక్కడ?

- ఏడాదిగా కనిపించని వాహనం
- ప్రైవేట్ జేసీబీతో పనులు
- లక్షల రూపాయలు దుబారా


తాండూరు బల్దియా జేసీబీ(ఫైల్)


డ్రైనేజీని శుభ్రం చేస్తున్న ప్రైవేట్ జేసీబీ

తాండూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో ఐదేళ్ల కిందట లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన జేసీబీ ఏడాది కాలంగా మున్సిపల్ పరిధిలోనే కనిపించడంలేదు. ప్రస్తుతం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు జేసీబీ అవసరం ఎంతగానో ఉంటుంది. దాదాపు ఏడాది కాలంగా మున్సిపాలిటీ ఆవరణలో జేసీబీ కనిపించకపోవడంతో కౌన్సిలర్లు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే మున్సిపాలిటీ అధికారులు మాత్రం జేసీబీని మరమ్మతుల నిమిత్తం హైదరాబాద్‌లోని షోరూంకు పంపించామని చెబుతున్నారు. మరమ్మతు పనులకు రూ.5ల క్షలు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. అయితే జేసీబీ లేని కారణంగా ప్రైవేట్‌కు చెందిన జేసీబీని వినియోగిస్తున్నారు. ఇటీవల చిలుకవాగు మరమ్మతు పనులకు, చెత్త డంపింగ్ యార్డులో చెత్తను ఎత్తేందుకు, వివిధ వార్డుల్లో అభివృద్ధి పనుల నిమిత్తం ప్రైవేటు జేసీబీతోనే పనులు చేపట్టారు. పైప్‌లైన్‌ల కోసం తవ్వకాలకు కంపచెట్ల తొలగింపునకు, ఇతర అత్యవసర పనుల నిమిత్తం జేసీబీని కొనుగోలు చేశారు. అయితే ప్రైవేట్ జేసీబీలు వాడటం వల్ల మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి పెద్దఎత్తున బిల్లులు చెల్లించారు. మున్సిపాలిటీలో ఉన్న జేసీబీ మాత్రం మరమ్మతుల పేరిట ఏడాది కాలంగా కనిపించకుండా చేశారు.

వారం రోజుల్లో జేసీబీని అందుబాటులోకి తెస్తాం



తాండూరు బల్దియాకు చెందిన జేసీబీ మరమ్మతుల కారణంగా హైదరాబాద్ షెడ్డుకు తరలించింది వాస్తవమే. మరమ్మతుల నిమిత్తం రూ.5లక్షలు షోరూంకు బిల్లు చెల్లిస్తున్నాం. జేసీబీ మరమ్మతులు షోరూంలోనే చేయాలనే ఉద్దేశ్యంతోనే హైదరాబాద్‌కు పంపించాం. వారం రోజుల్లో జేసీబీని అందుబాటులోకి తెస్తాం. - ఖాజా హుస్సేన్, ఏఈ

జేసీబీ మిస్సింగ్‌పై అనుమానాలున్నాయి



కొద్ది నెలలుగా మున్సిపాలిటీ జేసీబీ ఎక్కడికెళ్లిందని ప్రశ్నిస్తున్నా అధికారులు సరైన సమాధానం చెప్పడంలేదు. జేసీబీని ఎక్కడ పనులు చేయించడానికి పంపారో తెలియడంలేదు. అధికారులు వారం రోజుల్లో అందుబాటులోకి తీసుకురాకుంటే జేసీబీ మిస్సింగ్ కింద ఫిర్యాదు చేయాలని నిర్ణయించాం. ఏడాది కాలంగా మున్సిపల్ జేసీబీ లేని కారణంగా వార్డుల్లో ప్రైవేట్ జేసీబీతో పనులు చేయించి లక్షలలో మున్సిపల్ నిధులను దుబారా చేస్తున్నారు. - ముక్తార్ నాజ్, కౌన్సిలర్

ప్రైవేట్ జేసీబీతో వ్యక్తికి సాయం

తాండూరు పట్టణం ఆదర్శనగర్‌లో ఓ భవన నిర్మాణం జరుగుతోంది. ఆ భవన నిర్మాణం వల్ల ఆ కాలనీల్లో ఉన్న మురుగు కాల్వలో సిమెంటు బస్తాలు, ఇసుక పడి మొత్తం మురుగు కాల్వలు నిండి రోడ్లపైకి వచ్చాయి. దీంతో స్థానికులు, దుర్వాసనతో ఇబ్బంది పడ్డారు. స్థానికుల ఫిర్యాదుతో మున్సిపల్ అధికారులు అట్టి నిర్మాణ యజమానిపై చర్యలు తీసుకోకుండా మున్సిపల్ నుంచి అద్దె జేసీబీ యంత్రాన్ని పంపించి కాల్వలను శుభ్రం చేయించడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లక్షల్లో మున్సిపాలిటీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని పలువు ఆరోపిస్తున్నారు.

క్రైం కార్నర్

గంజాయి విక్రయిస్తున్న యువకుడు రిమాండ్



గంజాయితో మహేష్

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని పోచారం ఐటీకారిడార్ పోలీసులు అరెస్టుచేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం మున్సిపల్, అన్నోజిగూడ, లక్ష్మీనర్సింహ కాలనీకి చెందిన పండ్యాల మహేష్(19) ఫ్లవరిస్టుగా పనిచేస్తుంటాడు. చెడు అలవాట్లకు బానిసై ఏపీలోని అరకు ప్రాంతం నుంచి గంజాయిని తక్కువధరకు కొనుగోలుచేసి, పోచారం పరిసర ప్రాంతాల్లో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎక్కువ ధరకు విక్రయిస్తుంటాడు. అందులో భాగంగా గురువారం అన్నోజిగూడ లక్ష్మీనర్సింహాకాలనీలో విక్రయిస్తుండగా పోలీసులు మహేష్‌ను అదుపులోకి తీసుకొన్నారు. అతడి వద్ద 660గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు మహేష్‌ను రిమాండ్‌కు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కీసర రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆటోలో మర్చిపోయిన మొబైల్‌ఫోన్‌ను 24గంటల్లోపే కీసర పోలీసులు బాధితుడికి అందజేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య వివరాలిలా ఉన్నాయి. నాగారం మున్సిపాలిటీ ఆర్ఎల్ నగర్‌లో నివాసముంటున్న అక్షయ్‌కుమార్ గచ్చిబౌలిలోని పోసిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజూమాదిరిగానే విధులు ముగించుకుని ఓలా ఆటో బుక్‌చేసుకుని అందులో ఇంటికి చేరుకున్నారు. ఆటో దిగే క్రమంలో తన రూ.1.30లక్షల విలువైన ఐఫోన్‌ను ఆటోలో మర్చిపోయాడు. ఇంట్లోకి వెళ్లి ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో వెంటనే కీసర పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు చాకచక్యంగా ఆటోవాలాను అదుపులోకి తీసుకుని ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆటోవాలా నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్‌ను బాధితుడు అక్షయ్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ ఎస్ఐ వెంకట్‌నారాయణ, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

36గుంటల భూమిపై విచారణ చేపట్టాలి


వినతిపత్రం అందజేస్తున్న అమీర్ అబ్దుల్లా

తాండూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణ పరిధిలోని సర్వే నంబర్ 130 సెల్ డీడ్ డ్యాకుమెంట్ నంబర్ 9699/88 తేదీ 29-12-1983 మహమ్మద్ పేరుతో 36గుంటల భూమిని కుర్షిద్ ఉమ్మడి కుటుంబసభ్యుల నుంచి కొనుగోలు చేశామని అట్టి భూమిపై విచారణ చేపట్టి పట్టాచేయాలని భూమి కొనుగోలు దారుడు అమీర్‌అబ్దుల్లా తహసీల్దార్ తారాసింగ్‌కు గురువారం వినతిపత్రం అందజేశాడు. రెవెన్యూ అధికారులు ప్రస్తుతం ప్రభుత్వభూమిగా పేర్కొంటూ సర్వేనిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తున్నారని తెలిపాడు. 23-12-2000 సంవత్సరంలో ప్రొసిడింగ్ ఆర్డర్ నం. ఎ/4238/2000 జారీచేసి తన తండ్రి పేరిట పట్టాదారు పుస్తకం జారీ చేసినట్లు పేర్కొన్నాడు. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు 1965లో రెవెన్యూరికార్డు ప్రకారం ప్రభుత్వ భూమిగా రికార్డు చూయిస్తున్నందు వాపోయాడు. ఇట్టి భూమిని విచారణ జరిపి పట్టా భూమిగా మార్చాలని వారు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ తారాసింగ్‌ను విలేకరులు వివరణ కోరగా ఇట్టిభూమి 1965రికార్డులో ప్రభుత్వ భూమిగా నమోదు అయ్యి ఉందని ఈ భూమిపై పాత రికార్డులను పూర్తి స్థాయిలో విచారణ చేసి ఏ భూమి అనేది తేలుస్తామని తెలిపారు.

అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తాం


యాలాల: కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయంలో కార్యకర్తలతో మనోహర్‌రెడ్డి

తాండూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తాండూరులోని బీసీ శ్మశాన వాటిక అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధంచేసి నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ విన్నపం మేరకు గురువారం పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న బీసీ శ్మశాన వాటికను ఎమ్మెల్యే పరిశీలించారు. శ్మశానవాటికలో ఉన్న ముళ్ల పొదలు తొలగించాలని వారు విన్నవించారు. స్పెషల్ డ్రైవ్ పేరుతో శ్మశాన వాటికలో క్లీన్‌అండ్‌గ్రీన్ చేపట్టాలని నీటిసౌకర్యం కల్పించాలని రాజ్‌కుమార్ విన్నవించగా ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, డీసీసీబీ వైస్‌చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, నాయకులు కరుణం పురుషోత్తంరావు, కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

యాలాల: కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం యాలాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి, కో-ఆప్షన్ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అక్బర్‌బాబా, చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి, మంగలి అశోక్, నాగయ్య, మారుతి, మైనుద్దీన్, నాయకులు అమృతయ్య, మాజీ ఎంపీటీసీ రాజు, అగ్గనూరు మాజీ సర్పంచ్ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ అంత్యక్రియలు పూర్తి


నర్సింహులు(ఫైల్)

తాండూరు, నవంబరు 21: బీజేపీ సీనియర్ నాయకుడు, ప్రముఖ వ్యాపారి, మున్సిపల్ మాజీచైర్మన్ నాగారం నర్సింహులు బుధవారం గుండెపోటుతో కన్నుమూశారు. నర్సింహులు స్వగ్రామం బంట్వారం మండలం కొత్తపల్లిలో గురువారం అంత్యక్రియలు పూర్తయ్యాయి. తాండూరులో నిర్వహించిన అంతిమయాత్రలో వ్యాపారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. నర్సింహులు మృతివిషయం తెలుసుకున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, హర్యానా గవర్నర్ దత్తాత్రేయ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో సంతాపం తెలిపారు. తాండూరులో నర్సింహులు భౌతికకాయానికి ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఎం.రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మాల మహానాడు మండల కమిటీ

ధారూరు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మాలమహానాడు మండల కమిటీని గురువారం ధారూరులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ మండలాధ్యక్షుడిగా బీ.వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా బి.రాంచందర్, ఉపాధ్యక్షులుగా బీ.రాజు, యాదయ్య, కే.అంజయ్య, కోశాధికారిగా ఎం.నరేష్, అధికారప్రతినిధిగా బి.శివరాజ్, సోషల్ మీడియా బాధ్యుడిగా కే.మహేష్, సలహాదారులుగా బి.చిన్నయ్య, యాదన్న, బి.శ్రీనివాస్, టి.సుదర్శన్, బి.పురుషోత్తంలను ఎన్నుకున్నారు.

సైన్స్ సంబురాల నిర్వహణ అభినందనీయం


కీసర రూరల్: పరీక్షకు హాజరైన విద్యార్థులు

కీసర రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్ సంబురాలు నిర్వహించడం అభినందనీయమని నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాములు అన్నారు. జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో గురువారం నాగారం జడ్పీహెచ్ఎస్‌లో చెకుముకి సైన్స్ సంబురాలు-2024ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఈనెల 28న నిర్వహించనున్న జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు ఆనంద్‌కుమార్, శ్రీనివాస్, ఎంఎల్ చౌదరి, ఉపాధ్యాయులు వందన, సంతోషి, అరుణ, శైలజా పాల్గొన్నారు.

కొడంగల్: స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో గురువారం జన విజ్ఞాన వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో చెకుముకి సంబరాలను ఘనంగా నిర్వహించారు. మండల స్థాయి పోటీ పరీక్షల్లో కొడంగల్ పట్టణంలోని అన్నీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు అబ్దుల్ బాసిత్, అరుణ్‌కుమార్, సుమయ ఫాతీమా జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎండీ.మక్సూద్ అలీ తెలిపారు.

బొంరాస్‌పేట్: జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో చౌదర్‌పల్లి, రేగడిమైలారం, బొట్లవనితండా గిరిజన పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. బొంరాస్‌పేట్ జడ్పీహెచ్ఎస్ ఇంగ్లీష్, ఉర్దూ మీడియం విద్యార్థులు అబ్బాస్, కీర్తన, సుహాసిని, సమీనా, లక్ష్మీబాయి, పల్లవి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హరిలాల్, ఉపాధ్యాయులు ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీసింగ్.. చాలెంజింగ్ జాబ్

(5వ పేజీ తరువాయి)


పెరేడ్ నిర్వహిస్తున్న శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు

విమర్శలు వస్తాయన్నారు. మనం ఎలా పనిచేయాలనే విషయంలో ఈ 9నెలల శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలను కాపాడేందుకు ముందుగా పోలీసుకు ధైర్యం ఉండాలని, పిరికితనానికి పోలీస్‌శాఖలో తావులేదన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న 271మంది రేపటి నుంచి సిద్దిపేట, మహబూబాబాద్, కోమరంభీం, ఆసిఫాబాద్, రామగుండం, మంచిర్యాల జిల్లాల్లో పనిచేయనున్నారని అన్నారు. డీటీసీ ప్రిన్సిపల్ రవీందర్ మాట్లాడుతూ పోలీసు శిక్షణలో 271 మందికి శిక్షణ ఇచ్చామని 100శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ వైస్ ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఏవో జోతిర్మని, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు, పోలీసు ఉన్నతాధికారులు, శిక్షణ పూర్తి చేసుకున్న పోలీస్ కానిస్టేబుల్స్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాజీ పడకుండా విధులు నిర్వహించాలి: ఇంటెలిజెన్స్ డీజీపీ

మేడ్చల్ టౌన్: కొత్తగా పోలీసుశాఖలో అడుగుపెడుతున్న యువకులు శాంతిభద్రతలు నెలకొల్పే విషయంలో రాజీ పడకుండా విధులు నిర్వహించాలని ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి సూచించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ పోలీస్ శిక్షణ కళాశాలలో గురువారం శిక్షణ పూర్తి చేసుకున్న 526మంది సివిల్ కానిస్టేబుల్స్‌కు దీక్షితా పెరేడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ పట్ల ప్రజలకు నమ్మకం కలిగే విధంగా పని చేయాలన్నారు. అన్నిరకాల విధులను నిర్వహించడానికి అవసరమయ్యే అన్నివిభాగాల్లో శిక్షణ ఇచ్చామని తెలిపారు. పోలీస్ కళాశాల ప్రిన్సిపాల్ మధుకర్ మాట్లాడుతూ ప్రస్తుతం శిక్షణ పొందిన కానిస్టేబుళ్లలో చాలా మంది ఉన్నత చదువులు చదువుకున్న వారు అత్యధికులు ఉన్నందున వీరి సేవలు చాలావరకు ఉపయోగపడుతాయని తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన కానిస్టేబుళ్ల పరేడ్ నిర్వహించారు. కార్యక్రమంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు శిక్షణ పొందిన కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గుంతలో పడిన ఆవు

- శ్రమించి బయటికి తీసిన గ్రామస్తులు


ఆవును బయటికి తీసే ప్రయత్నం చేస్తున్న గ్రామస్తులు

తాండూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా తవ్వి వదిలేసిన గుంతలో ఓ ఆవు పడిపోగా స్థానికులు గంటలతరబడి శ్రమించి సురక్షితంగా బయటకు తీశారు. ఈ ఘటన తాండూరు మండల పరిధిలోని గోనూరు గేటు వద్ద చోటు చేసుకుంది. ఏయిర్టెల్ నెట్‌వర్క్ కోసం గుంతను తవ్వి వదిలివేయగా బుధవారం రాత్రి రైతు మాల మాణిక్యప్ప తన ఆవులను గోనూరు గేటు వద్ద కట్టేశాడు. ప్రమాదవశాత్తు సమీపంలోనే ఉన్న గుంతలో ఓ ఆవు పడిపోయింది. ఇరుకైన గుంత కావడంతో ఆవు ఇరుక్కుని తల్లడిల్లిపోయింది. గమనించిన రైతు గ్రామస్తుల సహకారంతో గుంతలో పడిన ఆవును బయటికి తీశారు. అధికారులు స్పందించి తవ్విన గుంత తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సరికొత్తగా 'ఉపాధి'

(5వ పేజీ తరువాయి)

వంద రోజుల చొప్పున పని కల్పించారు. కూలీలకు వేతనం రూపంలో రూ.139.40 కోట్లు ఖర్చు చేయగా, మెటీరియల్ ఖర్చు కింద రూ.25.20 కోట్లు వెచ్చించారు.

గ్రామ సభల్లో పనుల గుర్తింపు

ఉపాధి హామీపథకం పనుల్లో కొన్నిచోట్ల పనులు చేయకున్నా చేసినట్లు రికార్డుల్లో నమోదు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కూలీలకు పనులు కల్పించాలన్న లక్ష్యంతో ఎక్కువగా పూడికతీత పనులకు ఈసారి ప్రాధాన్యత ఇచ్చారు. ఇక నుంచి పూడికతీత పనులకు బదులుగా ఇతర పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలుస్తోంది. స్థానికంగా పనులు లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఉన్న చోటనే పనులు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇది వరకు చేపడుతున్న పనులకు బదులుగా కొత్త పనులు చేపట్టాలన్న ఆదేశాలు వచ్చాయి. కొత్త పనులు చేపట్టేందుకు ప్రజాభిప్రాయం సేకరించేందుకు అక్టోబరు 2వ తేదీన జిల్లాలో గ్రామ సభలు ప్రారంభం కాగా, నవంబరు 30వ తేదీ వరకు గ్రామ సభలు కొనసాగనున్నాయి. గ్రామ సభల్లో ఏయే పనులను ప్రజలు కోరుకుంటున్నారనేది గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. గ్రామ సభలు పూర్తయిన తర్వాత పరిపాలనా పరమైన అనుమతులకు పంపించనున్నారు. ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత గ్రామ సభల్లో గుర్తించిన పనులను ప్రారంభించి, వచ్చే ఏడాది, మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయి.

రైతులకు ఉపయోగ పడేలా..

ఈసారి చేపట్టనున్న పనుల్లో అధిక శాతం రైతులకు ఉపయోగ పడే పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. పశువుల పాకలు, కోళ్ల ఫారాలు, చెక్ డ్యాంలు, నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, బోరు బావుల రీచార్జి పనులు, పండ్ల తోటలు, భూసార సంరక్షణ పనులు, రైతుల పొలాలకు మట్టి రోడ్ల నిర్మాణం తదితర పనులు చేపట్టనున్నారు. సుమారు రూ.60 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పనకు దోహదపడే పనులు చేపడతారు. ఉపాధి హామీ పథకం కూలీలకు ఎక్కువ పని కల్పించడమే కాకుండా కనిపించే పనులు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి


ఫార్మసీ వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు ఆరోగ్యసూత్రాలు పాటించాలని అనురాగ్ యూనివర్సిటీ ఫార్మసీ డీన్ వసుధ భక్తి తెలిపారు. 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా గురువారం అనురాగ్ యూనివర్సిటీలో వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రజిని, రాజేంద్రకుమార్, సాయిద్, సంతోషి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధిలోని కొత్తగడికి చెందిన వెంకట్ రాంరెడ్డి ఇటీవల మృతిచెందగా గురువారం మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి మనోధైర్యాన్ని నింపారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం


అంబులెన్స్‌లో క్షేమంగా తల్లిబిడ్డతో కుటుంబీకులు, వైద్య సిబ్బంది

బషీరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణీని ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన బషీరాబాద్-తాండూరు ప్రధాన మార్గంలో అగ్గనూరు వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. కొడంగల్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన మౌనికకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108కి ఫోన్‌చేశారు. అంబులెన్స్‌లో తాండూరులోని మాతా శిశు, ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గ మధ్యలో అగ్గనూర్ సమీపంలోకి రాగానే నొప్పులు అధికమయ్యాయి. వాహనాన్ని పక్కకు నిలిపి డాక్టర్.శరత్, ఈఎంటీ హరీశ్ డెలివరీని విజయవంతం చేశారు. తల్లీబిడ్డక్షేమంగా ఉన్నారని తెలిపారు.

అంబేడ్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గం


అధ్యక్షుడు శివకుమార్

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ యువజన సంఘం ఎదులాబాద్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుమ్మడి శివకుమార్, ఉపాధ్యక్షులుగా గుమ్మడి ధనంజయ్య, బద్దం వెంకటేష్, ప్రధాన కార్యదర్శులుగా బద్దం శంకర్, గనుమల్ల మల్లేష్, కోశాధికారిగా శ్రీనివాస్, సలహాదారులుగా బద్దం నాగరాజు, ఎలుకంటి లింగం, దార నాగరాజులను నియమించారు. ఈ సందర్భంగా నియమితులైన అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ యువజన సంఘం అభివృద్ధికి కృషిచేయనున్నట్లు తెలిపారు.


జీవన్గి బృందం కీర్తనలు

బషీరాబాద్, నవంబరు 21: కార్తీక మాసం పురస్కరించుకొని వికారాబాద్ జిల్లా అనంతగిరి శ్రీ అనంత పద్మనాభ వారి సన్నిధిలో జరుగుతున్న 11 రోజులుగా అఖండ భజనాలు జరుగుతున్నాయి. ఈ అఖండ భజనలో మండలంలోని జీవన్గి గ్రామ భజన బృందం పాల్గొని కీర్తనలు ఆలపించారు. ఈ అఖండ భజనలో జిల్లా వ్యాప్తంగా సుమారు 250 భక్త బృందాలు పాల్గొనగా, జీవన్గి గ్రామ భజన బృందానికి గురువారం తెల్లవారుజామున సమయం కేటాయించారు.

క్రీడల్లో ప్రతిభ కనబరచాలి

మేడ్చల్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబర్చాలని మేడ్చల్ సీఐ సత్యనారాయణ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ గౌడవెల్లి పరిధిలోని కృషి హోమ్స్ ఆశ్రమంలో నిర్వహించిన వార్షిక క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గురువారం బహుమతులు అందజేశారు.

పర్యావరణాన్ని కాపాడాలి


జ్ఞాపిక అందుకుంటున్న ఎంపీడీవో రామకృష్ణ

కులకచర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధించి పర్యావరాన్ని కాపాడాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం కులకచర్ల పరిధి పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకంపై చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరుమలాపూర్ గ్రామానికి చెందిన భరత్‌కుమార్, ఉత్తమ్‌కుమార్ పర్యావరణ పరిరక్షణపై వేసిన పెయింటింగ్ జ్ఞాపికను ఎంపీడీవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో బాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువ పోలీసులు వస్తున్నారు..!

- శిక్షణ పూర్తి చేసుకున్న 66 ఏఆర్, 27 మంది సివిల్ కానిస్టేబుళ్లు

వికారాబాద్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శిక్షణపూర్తి చేసుకున్న యువ పోలీసు కానిస్టేబుళ్లు నేడు జిల్లాకు రానున్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో శిక్షణ పొందిన స్టయిపెండరీ ఎస్‌సీటీపీసీ శిక్షణ ముగిసింది. జిల్లా కేంద్రంలోని పోలీసు శిక్షణా కేంద్రంలో గురువారం పాసింగ్ ఔట్‌పరేడ్ నిర్వహించగా, మల్టీ జోన్-2 ఐజీ వి.సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై వారికి దిశానిర్దేశం చేశారు. జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో మొత్తం 271మంది అభ్యర్థులు శిక్షణపొందగా, వారిలో రామగుండం కమిషనరేట్‌కు చెందిన 119మంది, సిద్దిపేట్ కమిషనరేట్ నుంచి 60మంది, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన 50మంది, మహబూబాబాద్ జిల్లా నుంచి 34మంది అభ్యర్థులు ఉన్నారు. కాగా, వికారాబాద్ జిల్లాకు చెందిన 93మంది ఎస్‌సీటీపీసీ అభ్యర్థులు వివిధ పోలీసు శిక్షణా కేంద్రాల్లో శిక్షణపూర్తి చేసుకున్నారు. ఖమ్మం సీటీసీలో 17మంది, వరంగల్ పీటీసీలో 10, నల్లగొండ డీటీసీలో 50మంది, హైదరాబాద్‌లోని ఆర్‌బీవీఆర్ఆర్ టీజీపీఏలో 16మంది అభ్యర్థులు శిక్షణ పొందారు. ఏఆర్ విభాగంలో 66 మంది, సివిల్ విభాగంలో 27 మంది శిక్షణ తీసుకున్నారు. వివిధ పోలీసు శిక్షణ కేంద్రాల్లో పూర్తి చేసుకున్న జిల్లాకు చెందిన 93మంది యువ కానిస్టేబుళ్లు శుక్రవారం జిల్లా కేంద్ర పోలీసు కార్యాలయంలో రిపోర్ట్ చేయనున్నారు. జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి వారికి పోలీసుస్టేషన్లను కేటాయించి బాధ్యతలపై మార్గదర్శనం చేయనున్నారు. పోలీసు స్టేషన్లలో నిర్వహించాల్సిన బాధ్యతల గురించి దిశా నిర్దేశం చేస్తారు.

సంక్షిప్తంగా..

మాలల సింహగర్జనకు తరలాలి

పరిగి రూరల్: డిసెంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించే మాలల సింహగర్జనకు మాలలు తరలిరావాలని మాల సంఘం పరిగి పట్టణ అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం మాల సంఘం నాయకులతో కలసి ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అల్మాస్కాన్‌పేట్ భూముల సర్వే

కులకచర్ల: అల్మాస్కాన్‌పేట్ రెవెన్యూ పరిధిలోని కాస్తులో ఉన్న రైతుల భూములను రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ఇప్పటి వరకు 60సర్వే నెంబర్లతో 80 మంది రైతుల 700 ఎకరాల భూమిని సర్వే చేశారు. అల్మాస్కాన్‌పేట్‌లో 1056 ఎకరాల భూమి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

కులకచర్ల: మండలంలోని అంతారం గ్రామ ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్ఎం హన్మంతు బహుమతులు అందజేసి అభినందించారు.

సీపీఎం నాయకుల ముందస్తు అరెస్టు

దోమ: దుద్యాల మండలంలోని లగచర్లకు సీపీఎం నాయకులు వెళ్తున్నారనే సమాచారంతో పోలీసులు వారిని గురువారం ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో సీపీఎం మండల అధ్యక్షుడు సత్యంతో పాటు పలువురు ఉనారు. వీరిని సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

కొనసాగుతున్న కులగణన సర్వే

కొడంగల్ రూరల్: బోయపల్లి తండాలో ఎన్యుమరేటర్ సురేఖ, కార్యదర్శి బుగ్గప్ప ఇంటింటికి వెళ్లి కులగణన సర్వే నిర్వహించారు.

బీటీరోడ్డు పనులు ప్రారంభం

కొడంగల్ రూరల్: టేకుల్‌కోడ్ గ్రామ పంచాయితీకి అనుబంధంగా ఉన్న మొత్కులబండ తాండకు ముజురైన బీటీరోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ పూజలు నిర్వహించి గురువారం ప్రారంభించారు.

విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు కల్పించాలి

ధారూరు: పేదలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు వంటి వసతులు కల్పించాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు గురువారం తహసీల్దార్ సాజిదా బేగంను విన్నవించారు.